క్లుప్తంగా..

అంతర్జాతీయ సదస్సుకు కిట్స్ అధ్యాపకులు



అధ్యాపకులను అభినందిస్తున్న ప్రిన్సిపాల్

హసన్‌పర్తి: కిట్స్ కళాశాల మ్యాథ్స్‌అండ్ ఫిజికల్ సైన్స్ అధ్యాపకులు డాక్టర్ గ్రేస్ శాంతి, డాక్టర్ బంటి రాయ్‌లు రూపొందించిన పరిశోధన పత్రం అంతర్జాతీయ సదస్సుకు ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ డాక్టర్ అశోక్‌రెడ్డి తెలిపారు. 'భారతీయ సాంకేతిక భాషను ఉపయోగించి చెవిటి, మూగ వారికి కృత్రిమ మేధస్సు' అనే పరిశోధన పత్రం మార్చి మొదటి వారంలో ఆస్ట్రేలియాలో జరిగే అంతర్జాతీయ సదస్సులో సమర్పిస్తారని ప్రిన్సిపాల్ తెలిపారు. ఈసందర్భంగా బుధవారం కళాశాలలో జరిగిన కార్యక్రమంలో డాక్టర్ గ్రేస్ శాంతి, డాక్టర్ బంటి రాయ్‌లను ప్రిన్సిపాల్‌తో పాటు సహ అధ్యాపకులు అభినందించారు.

అనుమతి లేకుండా విహారయాత్ర

● హెచ్‌ఎంను వివరణ కోరిన డీఈఓ

విద్యారణ్యపురి: డీఈఓ అనుమతి లేకుండా మడికొండ జిల్లా పరిషత్ హైస్కూల్‌లోని కొందరు విద్యార్థులను హెచ్‌ఎం, పలువురు ఉపాధ్యాయులు బుధవారం విహార యాత్రకు తీసుకెళ్లినట్లు సమాచారం. సుమారు 45 మంది విద్యార్థులు, 8 మంది ఉపాధ్యాయులు రామప్ప, లక్నవరం, మల్లూరు ప్రాంతాలకు విహార యాత్రకు వెళ్లినట్లు తెలుస్తోంది. ఈవిషయమై డీఈఓ ఎండి అబ్దుల్‌హైని 'సాక్షి' వివరణ కోరగా.. ఈవిషయం తన దృష్టికి వచ్చిందని వివరణ ఇవ్వాలని హెచ్‌ఎంను ఆదేశించినట్లు అబ్దుల్‌హై వివరణ ఇచ్చారు.

పలువురికి పరామర్శ

కాజీపేట రూరల్: కాజీపేట 47వ డివిజన్ పరిధి బాలాజీనగర్‌కు చెందిన బీఆర్ఎస్ నాయకుడు పసునూరి మనోహర్ తల్లి కొమురమ్మ ఇటీవల మృతి చెందింది. మనోహర్ కుటుంబాన్ని బుధవారం చీఫ్‌విప్ వినయ్‌భాస్కర్ పరామర్శించారు. ఇంపీరియల్ కాలనీలో షార్ట్‌సర్క్యూట్‌తో గృహ పరికరాలు దగ్ధమైన అశోక్ కుటుంబాన్ని పరామర్శించారు. ఆయన వెంట కాజీపేట సీఐ గట్ల మహేందర్‌రెడ్డి, 47వ డివిజన్ కార్పొరేటర్ సంకు నర్సింగరావు, బీఆర్ఎస్ నాయకులు నార్లగిరి రమేశ్, మర్యాల కృష్ణ, దువ్వ కనకరాజు, కోండ్ర శంకర్, సిరిల్‌లారెన్స్, అఫ్జల్, దువ్వ నరేశ్, వినయ్, విజయకుమార్, గోవర్దన్, వెంకటేశ్, నాగేశ్ పాల్గొన్నారు.

పరీక్ష కిట్ల అందజేత



పరీక్ష కిట్లు అందజేస్తున్న చీఫ్ విప్ వినయ్

కాజీపేట: కాజీపేట ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాల ఆవరణలో బుధవారం 58 మంది 10వ తరగతి విద్యార్థులకు పబ్లిక్ పరీక్షలకు అవసరమయ్యే కిట్లను చీఫ్ విప్ వినయ్ భాస్కర్ పంపిణీ చేశారు. పాఠశాలలో సమస్యలపై చీఫ్ విప్‌కు హెచ్‌ఎం మామిడాల రాజేంద్రం వినతిపత్రం అందించారు. ఈకార్యక్రమంలో కిట్ల దాత సంతోశ్, కార్పొరేటర్ సంకు నర్సింగ్, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ అజీజ్‌ఖాన్, 'కుడా' మాజీ చైర్మన్ మర్రి యాదవరెడ్డి, నార్లగిరి రమేశ్, బి.రంజిత్‌కుమార్, దువ్వ కనకరాజ్, నాగవెల్లి శ్రీధర్, వినయ్, సుంచు అశోక్, రావుల సదానందం ఉన్నారు.

కనీస వేతనాలివ్వాలని వినతి



వినతి పత్రం అందజేస్తున్న మున్సిపల్ ఉద్యోగ, కార్మిక సంఘాల నాయకులు

వరంగల్ అర్బన్: బల్దియా ఔట్ సోర్సింగ్ కార్మికులకు కనీస వేతనం రూ. 21.000 ఇవ్వాలని ఎమ్మెల్సీ బస్వరాజు సారయ్య, తూర్పు ఎమ్మెల్యే నన్నపునేని నరేందర్‌కు మున్సిపల్ ఉద్యోగ, కార్మిక సంఘాల నాయకులు వేర్వేరుగా వినతి పత్రాలు అందజేశారు. ఇందులో బొట్ల భిక్షపతి మాదిగ, ఏల్పుల ధర్మరాజు, బొట్ల రమేశ్, రాజారపు భాస్కర్, మున్నంగి రఘు, పుల్ల దేవేందర్, గంగినేని కళ్యాణ్ రామ్, డెంగు దామోదర్, ఎ.సుకుదేవ్. ఎల్లాస్వామి. ఏకు సుధాకర్, వెంకన్న, కొట్టే మల్లయ్య, రోంటాల కోటేశ్వర్ పాల్గొన్నారు.

'కిషన్‌రావుకు కుల సంఘంతో సంబంధం లేదు'

హన్మకొండ అర్బన్: లింగంపల్లి కిషన్‌రావు పెట్టే మీటింగ్‌లకు ఆరె సంఘానికి ఎలాంటి సంబంధం లేదని ఆరె సంక్షేమ సంఘం నాయకులు స్పష్టం చేశారు. కిషన్‌రావును గతంలోనే స్టీరింగ్ కమిటీ చైర్మన్ పదవి నుంచి తొలగించి చెట్టుపెల్లి శివాజీ నేతృత్వంలో స్టీరింగ్ కమిటీ నూతన చైర్మన్‌ను ఎన్నుకోవడం జరిగిందని జిల్లా అధ్యక్షులు హంగె శివాజీ తెలిపారు.

మార్కెట్‌కు తగ్గిన ఆదాయం

● కమర్షియల్ కాంప్లెక్స్ షటర్ల వేలం
● గతేడాదితో పోలిస్తే రూ.26.28 లక్షల నష్టం
● బకాయిలున్న మరో 7 షటర్లకు త్వరలో వేలం



షటర్లకు వేలం నిర్వహిస్తున్న అధికారులు

వరంగల్: వరంగల్ లక్ష్మీపురం మోడల్ కూరగాయల మార్కెట్‌లోని కమర్షియల్ కాంప్లెక్స్‌లో ఖాళీగా ఉన్న షటర్లకు నిర్వహించిన వేలానికి ఆదరణ కరువైంది. 2021లో నిర్వహించిన వేలంలో పోటీ పడి పాడిన వ్యాపారులు ప్రస్తుతం పాల్గొనలేదు. దీంతో కొందరు తక్కువ ధరకు షటర్లను దక్కించుకున్నారు. బుధవారం ఏనుమాముల వ్యవసాయ మార్కెట్ ప్రధాన కార్యాలయంలోని హాల్‌లో 18 షటర్లకు వేలం నిర్వహించగా.. 28 మంది వ్యాపారులు పాల్గొన్నారు. గతంలో షటర్లు పొందిన వ్యాపారులు తలకుమించిన భారంగా భావించి అద్దెలు చెల్లించలేదు. మూడు నెలల అడ్వాన్సులను జప్తు చేసి మార్కెట్ అధికారులు వేలం నిర్వహించారు. 2021డిసెంబర్‌లో వేలం నిర్వహించిన సమయంలో ఈ 18షటర్ల నుంచి నెలకు రూ.3,74,900లు ఆదాయం రాగా.. బుధవారం నిర్వహించిన వేలం ద్వారా కేవలం రూ.1,55,050లు ఆదాయం సమకూరనుంది. నెలకు రూ.2.19లక్షలు అంటే ఏడాదికి రూ.26.28 లక్షలు మార్కెట్ ఆదాయానికి గండి పడుతోంది.

అద్దె తగ్గింది..

గతంలో ఒకటో నంబర్ షాపునకు అద్దె రూ.30వేలు పలకగా.. ఇప్పుడు రూ.7,300లు మాత్రమే పలికింది. ఒక్కో షటర్‌కు రూ.23 వేల నుంచి రూ.10వేలకు తక్కువగా ఆదాయం రానుంది. ప్రస్తుతం నిర్వహించిన షటర్లను పొందేందుకు వ్యాపారులు ముందుగానే రూ.10నుంచి 12వేలలోపు మాత్రమే పాడాలని నిర్ణయించుకోవడం వల్ల వేలంలో ఎక్కువ అద్దెలు లభించలేదని తెలిసింది. ఈవేలంలో మార్కెటింగ్‌శాఖ ఆర్జేడీ ఇ.మల్లేశం, మార్కెట్ కమిటీ చైర్మన్ దిడ్డి భాగ్యలక్ష్మీ, డీడీఎం అజ్మీరా రాజు, డీఎంఓ ప్రసాదరావు, మార్కెట్ కమిటీ సభ్యులు పల్లెపాటి శాంతిరతన్‌రావు, సెలక్షన్‌గ్రేడ్-1 కార్యదర్శి బి.వీ.రాహుల్, గ్రేడ్-2కార్యదర్శి చందర్‌రావు, సహాయ కార్యదర్శి జన్ను భాస్కర్, పర్యవేక్షకులు శివకుమార్, సూపర్‌వైజర్ వెంకన్న తదితరులు పాల్గొన్నారు. కాగా.. అద్దె బకాయిలున్న 5 షటర్లలో కోర్టు కేసుల్లో ఉండగా.. 18 షట్టర్లకు వేలం నిర్వహించినట్లు, మరో ఏడింటికి ఫైనల్ నోటీసులు ఇచ్చి వాటికి త్వరలోనే టెండర్లు నిర్వహిస్తామని గ్రేడ్-1 మార్కెట్ కార్యదర్శి రాహుల్ తెలిపారు.

గత, ప్రస్తుత వేలంలో అద్దె ఇలా..

షాప్ నం	2021	2023
1	30,000	7,300
2	24,000	5,000
3	18,700	4,600
4	22,400	7,400
5	18,500	4,600
8	21,800	8,050
9	20,600	10,800
10	18,300	4,650
11	18,800	10,500
12	19,000	10,000
14	20,100	10,500
16	16,900	5,150
17	20,400	10,500
19	17,200	10,700
22	20,100	10,800
23	21,400	9,300
25	20,200	12900
28	26,500	12,300
మొత్తం	3,74,900	1,55,050

'కంటి వెలుగు' కేంద్రాలు ప్రారంభం



కాజీపేట అర్బన్: శిబిరాన్ని ప్రారంభిస్తున్న కార్పొరేటర్ మామిండ్ల రాజు

కాజీపేట అర్బన్: కంటి వెలుగు శిబిరాన్ని వినియోగించుకోవాలని 31వ డివిజన్ కార్పొరేటర్ మామిండ్ల రాజు అన్నారు. డివిజన్ పరిధి న్యూశాయంపేట ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో బుధవారం కార్పొరేటర్ మామిండ్ల రాజు, మాజీ కార్పొరేటర్ మాడిశెట్టి శివశంకర్ కంటి వెలుగు శిబిరాన్ని ప్రారంభించారు. ఈకార్యక్రమంలో వైద్యులు రోహిత్‌శర్మ, మౌనిక, డివిజన్ బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.

20వ డివిజన్‌లో..

కాశిబుగ్గ: పేదల జీవితాల్లో వెలుగులు నింపేందుకే రాష్ట్ర ప్రభుత్వం కంటి వెలుగు కార్యక్రమం చేపట్టిందని 20వ డివిజన్ కార్పొరేటర్ గుండేటి నరేంద్రకుమార్ అన్నారు. బుధవారం ఆయన 20వ డివిజన్ కాశిబుగ్గ పద్మానగర్ పద్మశాలి భవన్‌లో ఏర్పాటు చేసిన కంటి వెలుగు కేంద్రాన్ని ప్రారంభించారు. ఈకార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ బయ్యా స్వామి, బీఆర్ఎస్ డివిజన్ అధ్యక్షుడు ఎండి ఇక్బాల్, కంటి వెలుగు కేంద్రం వైద్యులు గుండా రవీందర్, కిరణ్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

మీ సేవలు గొప్పవి

● ఎమ్మెల్యే నరేందర్
● ఓరుగల్లు అంబులెన్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ప్రారంభం



ఎమ్మెల్యే నరేందర్‌ను సన్మానిస్తున్న అసోసియేషన్ నాయకులు

రామన్నపేట: 24 గంటలు ప్రజలకు మీరు అందించే సేవలు గొప్పవని ఓరుగల్లు వెల్ఫేర్ అసోసియేషన్‌ను ఉద్దేశించి ఎమ్మెల్యే నన్నపునేని నరేందర్ అన్నారు. ఎంజీఎం సెంటర్ వద్ద నూతనంగా ఏర్పడిన ఓరుగల్లు అంబులెన్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ప్రారంభ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై జెండా ఆవిష్కరించారు. కార్యక్రమంలో సంఘం గౌరవ అధ్యక్షులు యెలుగం సత్యనారాయణ, కార్పొరేటర్ శిరీశ్, చింతకుల సునీల్, అధ్యక్షుడు కోట సంజీవ్, ఉపాధ్యక్షుడు ఎండీ గౌస్ పాషా, ఉపాధ్యక్షుడు వడ్నాల శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి దూపేటి సతీశ్, నాయకులు కుంబాల రమేశ్, రాకల సత్యం, ఎండీ అజీమ్, వినయ్‌కుమార్, ఎండీ యూసూబ్, దీపక్, శ్రీనివాస్, రమేశ్, రాజు, భిక్షపతి, తదితరులు పాల్గొన్నారు.

కేడీసీ ప్రిన్సిపాల్‌కు సన్మానం



సన్మానిస్తున్న పూర్వ విద్యార్థుల సంఘ బాధ్యులు

విద్యారణ్యపురి: కాకతీయ ప్రభుత్వ డిగ్రీ కళాశాల న్యాక్ ఏ ప్లస్ గ్రేడ్ సాధించడంతో ఆ కళాశాల పూర్వ విద్యార్థుల సంఘం ఆధ్వర్యంలో బుధవారం కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ జి.రాజారెడ్డి, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ ఎ.సంజీవయ్యను, ఐక్యూ ఏసీ కో-ఆర్డినేటర్ డాక్టర్ బి.రమేశ్‌ను, అలూమ్ని కోశాధికారి డాక్టర్ ఎస్.వినోద్‌రావును ఘనంగా సన్మానించారు. కళాశాల పూర్వవిద్యార్థులు మహబూబాబాద్ మాజీ ఎంపీ అజ్మీర సీతారాంనాయక్, కాంగ్రెస్ నేత బొద్దిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, పూర్వ విద్యార్థుల సంఘం అధ్యక్షుడు డాక్టర్ ఎస్‌వీఎస్‌చారి, జనరల్ సెక్రటరీ కె.సోమిరెడ్డి, కార్యదర్శులు పాల్గొన్నారు.

ఆర్‌సీటీఏ బాధ్యులు..

కేడీసీకి న్యాక్ ఏ ప్లస్ లభించడంతో ఆ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ జి.రాజారెడ్డిని, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ ఎ.సంజీవయ్యను, ఐక్యూఏసీ కోఆర్డినేటర్ డాక్టర్ బి.రమేశ్‌ను ఆ కళాశాల రిటైర్డ్ టీచర్స్ అసోసియేషన్ (ఆర్‌సీటీఏ) అధ్యక్షుడు డాక్టర్ పులిసారంగపాణి కార్యదర్శి డాక్టర్ మల్లారెడ్డి, కోశాధికారి సత్యనారాయణ అభినందించారు.

కేంద్ర నిధులతోనే నగరాభివృద్ధి

● బీజేపీ నేత ఎర్రబెల్లి ప్రదీప్‌రావు
● తూర్పుకోటలో బీజేపీ శక్తి కేంద్రం, స్ట్రీట్ కార్నర్ సమావేశం



మాట్లాడుతున్న ఎర్రబెల్లి ప్రదీప్‌రావు

ఖిలా వరంగల్: కేంద్ర ప్రభుత్వ నిధులతోనే నగరాభివృద్ధి జరుగుతోందని బీజేపీ నేత, వరంగల్ అర్బన్ కో-ఆపరేటివ్ బ్యాంక్ చైర్మన్ ఎర్రబెల్లి ప్రదీప్‌రావు అన్నారు. ఈమేరకు బుధవారం రాత్రి బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు పిట్టల కిరణ్, ఓబీసీ మోర్చా జిల్లా అధ్యక్షుడు కందిమల్ల మహేశ్ అధ్యక్షతన శక్తి కేంద్రం కార్నర్ సమావేశం జరిగింది. ముఖ్య అతిథిగా ఆయన హాజరై బీఆర్ఎస్‌పార్టీ ప్రజా ప్రతినిధులు ఏళ్ల గడుస్తున్నా కనీసం డివిజన్ సమస్యలను పరిష్కరించలేదని ఆరోపించారు. బీజేపీ అధికారంలోకి రాగానే.. నగరాన్ని మరింత సుందరంగా తీర్చిదిద్దుతామని ఆయన తెలిపారు. అనంతరం మహిళలు ఎర్రబెల్లి ప్రదీప్‌రావును శాలువాతో ఘనంగా సత్కరించారు. ఈసమావేశంలో నాంద్రే అమర్‌నాథ్, సతీశ్, సంపత్‌రావు, తదితరులు పాల్గొన్నారు.

స్కీంల పేరుతో స్కాం: కొండేటి



మాట్లాడుతున్న కొండేటి శ్రీధర్

హసన్‌పర్తి: కేంద్రం నుంచి వచ్చే నిధులను బీఆర్ఎస్ సర్కారు దారి మళ్లించి స్కీంల పేరుతో స్కాంలకు పాల్పడుతోందని బీజేపీ వరంగల్ జిల్లా అధ్యక్షుడు కొండేటి శ్రీధర్ అన్నారు. ప్రజా గోస-బీజేపీ భరోసాలో భాగంగా బుధవారం ఒకటో డివిజన్ ముచ్చర్ల, పెగడపల్లిలో స్ట్రీట్ కార్నర్ మీటింగ్ నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన కొండేటి శ్రీధర్ కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను ఇంటింటికీ వెళ్లి ప్రజలకు వివరించాలని పిలుపునిచ్చారు. ఈకార్యక్రమంలో బీజేపీ డివిజన్ అధ్యక్షుడు దేవరకొండ అనిల్ ఉపాధ్యక్షులు గ్యాదరబోయిన తిరుపతి, శక్తికేంద్ర ఇన్‌చార్జ్‌లు, మట్టెడ శ్రీనివాస్, చింతల రాకేశ్, బీజేవైఎం డివిజన్ అధ్యక్షుడు ప్రశాంత్‌రెడ్డి, మాజీ ఎంపీటీసీ పెద్ది మహేందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సామాజిక తనిఖీపై సమగ్ర విచారణ

● వరంగల్ కలెక్టర్ గోపి



వీసీలో పాల్గొన్న కలెక్టర్ గోపి, అదనపు కలెక్టర్ అశ్విని తానాజీ

వరంగల్ రూరల్: ఉపాధిహామీ పథకం కింద చేపట్టిన అభివృద్ధి పనుల్లో సామాజిక తనిఖీల్లో తేలిన లెక్కల వ్యత్యాసంపై సమగ్ర విచారణ చేపడతామని వరంగల్ కలెక్టర్ డాక్టర్ బి.గోపి అన్నారు. అందుకు బాధ్యులైన వారిపై చర్యలు తీసుకుంటామన్నారు. బుధవారం హైదరాబాద్ నుంచి సోషల్ ఆడిట్ తేడాలు.. సమగ్ర విచారణపై పంచాయతీరాజ్ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ సందీప్‌కుమార్ సుల్తానియా కలెక్టర్లు, అదనపు కలెక్టర్లు, డీఆర్‌డీఓలతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా సుల్తానియా మాట్లాడుతూ సామాజిక తనిఖీల్లో చూపిన అవకతవకలు, లోపాలకు సంబంధించి మౌఖిక ఆదేశాలపై చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. కలెక్టర్ గోపి మాట్లాడుతూ ఇప్పటివరకు నిర్వహించిన సోషల్ ఆడిట్ వ్యత్యాసాలపై సమగ్ర విచారణ జరిపిస్తామన్నారు. ప్రభుత్వ ఆదేశాలకు అనుగుణంగా జాబ్‌కార్డు ఉన్న ప్రతి ఒక్కరికి ఉపాధి పథకంలో పనులు కల్పిస్తామని చెప్పారు. వీసీలో అదనపు కలెక్టర్ అశ్విని వాకడే, డీఆర్‌డీఓ సంపత్‌రావు పాల్గొన్నారు.

అదనపు కలెక్టర్‌కు టీఎన్‌జీఓల సన్మానం



వరంగల్ రూరల్: కన్‌ఫర్డు ఐఏఎస్ అర్హత సాధించిన అదనపు కలెక్టర్ శ్రీవత్స కోటను టీఎన్‌జీఓస్ జిల్లా అధ్యక్షుడు గజ్జల రాంకిషన్ ఆధ్వర్యంలో బుధవారం కలెక్టరేట్‌లోని ఆయన చాంబర్‌లో ఘనంగా సన్మానించారు. యూనియన్ జిల్లా కార్యదర్శి గాజె వేణుగోపాల్, కోశాధికారి పాలకుర్తి సదానందం, ఉపాధ్యక్షులు జగదీశ్వర్, మురళీధర్‌రెడ్డి, గద్దల రాజు, రామకృష్ణ, ఇంద్రసేనారెడ్డి, జిల్లా నాయకులు నాగేశ్వర్‌రావు, బుచ్చయ్య, కాంట్రాక్టు ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు రాజేష్, విద్యా శాఖ ఫోరం అధ్యక్షుడు ఎస్.బి.శ్రీనివాస్, నాగరాజు, కుమారక్రాంతి, ఏంజెల్, ఎంజీఎం ఆస్పత్రి యూనిట్ కార్యదర్శి రవీందర్, భానుప్రకాష్, కిషన్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

రౌడీయిజం చెల్లదు



మాట్లాడుతున్న అంకూస్

కాజీపేట: రౌడీయిజంతో రాజకీయాలు చెల్లవనే విషయాన్ని అధికార పార్టీ నాయకులు గుర్తిస్తే మేలని కాంగ్రెస్ పార్టీ జిల్లా కమిటీ సభ్యులు ఎండీ అంకూస్ అన్నారు. కాజీపేట మీడియా పాయింట్ ఆవరణలో బుధవారం విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. ఇందులో ఆయన మాట్లాడుతూ.. పశ్చిమ ఎమ్మెల్యేకు వ్యతిరేకంగా గళమెత్తిన తోట పవన్‌ను బీఆర్ఎస్ కార్యకర్తలు తీవ్రంగా కొట్టడం ఎంత వరకు సమంజసమని విమర్శించారు. పోలీసులు రాజకీయ పార్టీలకు వత్తాసు పలుకడం మానుకోని సమాజహితం కోసం పని చేయాలని సూచించారు. ఈసమావేశంలో ఆరూరి సాంబయ్య, మేకల ఉపేందర్, ఎంపీ రాజు, ఎండి రహమతుల్లా, కొండ శివ, బుర్ర బాబురావు, క్రాంతి భరత్, ఇన్నారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న కేసీఆర్ క్రికెట్ చాంపియన్ షిప్ పోటీలు

కేయూ క్యాంపస్: క్రీడాకారులను ప్రభుత్వం ప్రోత్సహిస్తోందని, తమకు ఇష్టమైన క్రీడలపై ఆసక్తి పెంచుకొని భవిష్యత్‌లో రాణించాలని 'కుడా' చైర్మన్ సుందర్‌రాజు యాదవ్ కోరారు. బీఆర్ఎస్‌వీ, కాకతీయ క్రికెట్ అకాడమీ సంయుక్త ఆధ్వర్యంలో చీఫ్ విప్ దాస్యం వినయ్‌భాస్కర్ నేతృత్వంలో నిర్వహిస్తున్న కేసీఆర్ క్రికెట్ చాంపియన్ షిప్ పోటీలు హనుమకొండలోని యూనివర్సిటీ ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల మైదానంలో కొనసాగుతున్నాయి. బుధవారం క్వార్టర్ ఫైనల్ పోటీలను సుందర్‌రాజుయాదవ్ టాస్‌వేసి ప్రారంభించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్‌వీ జిల్లా కో-ఆర్డినేటర్ బైరపాక ప్రశాంత్, కాకతీయ క్రికెట్ అకాడమీ చైర్మన్ ఫారూఖ్, విద్యార్థి సంఘం నాయకులు వీరేందర్, రాకేశ్, పరుశరాములు, రాంబాబు, తిరుపతి, నరేంద్ర, ప్రవీణ్, స్నేహిత్, రోహిత్, రాజేశ్, ఐలోని, అభిషేక్ తదితరులు పాల్గొన్నారు. కాగా.. ఈపోటీలు బుధవారం పోటాపోటీగా కొనసాగాయి. 53, 47, 7, 51వ డివిజన్ల జట్లు సెమీఫైనల్ పోటీలకు చేరుకున్నాయి.

బండా ప్రకాశ్‌కు అభినందనలు తెలిపిన టీఏఎస్‌సీఏ సభ్యులు



హన్మకొండ కల్చరల్: నూతన తెలంగాణ శాసన మండలి వైస్ చైర్మన్‌గా ఎన్నికైన డాక్టర్ బండా ప్రకాశ్‌ను కలిసి తెలంగాణ ఆల్ సీనియర్ సిటిజన్ అసోసియేషన్(టాస్కా) సభ్యులు అభినందనలు తెలిపారు. ఈమేరకు తెలంగాణ ఆల్ సీనియర్ సిటిజన్ అసోసియేషన్ రాష్ట్ర కార్యదర్శి, వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ రిటైర్డ్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ సిద్దోజు విద్యాసాగర్, జిల్లా సెక్రటరీ వెల్పుల దేవాచారి, రిటైర్డ్ డీపీఆర్ఓ వెంకటనారాయణ, శ్రీపాద సుధాకర్, పొనుగోటి సారంగపాణి, మట్టెవాడ మాధవ్ బుధవారం బండా ప్రకాశ్‌ను ఆయన స్వగృహంలో కలిసి శాలువాతో సన్మానించారు. పుష్పగుచ్ఛం అందించి అభినందనలు తెలిపారు.

కంపోస్ట్ వేస్ట్ తయారీపై అవగాహన

హన్మకొండ అర్బన్: బాలసముద్రంలోని జీడబ్ల్యూఎంసీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న కంపోస్ట్ యార్డులో బుధవారం కంపోస్ట్ వేస్ట్ తయారీపై మున్సిపల్ జవాన్లు, సిబ్బందికి అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇంజనీర్ ఇండియా వరంగల్ లోకల్ చాప్టర్, ప్రేరణ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఈకార్యక్రమాన్ని ప్రతిష్టాత్మకంగా చేపట్టినట్లు ప్రేరణ ఫౌండేషన్ అధ్యక్షుడు పెండ్లి ఉపేందర్ రెడ్డి తెలిపారు. ఈకార్యక్రమంలో మున్సిపల్ జవాన్ సదానందం, సానిటరీ ఇన్‌స్పెక్టర్ సిలువేరు కరుణాకర్, సిబ్బంది పాల్గొన్నారు.

సంక్షిప్త సమాచారం..

నేడు శ్వేతార్కలో పుత్ర గణపతి వ్రతం

కాజీపేట: కాజీపేటలోని శ్వేతార్క మూల గణపతి దివ్యక్షేత్రంలో గురువారం పుత్ర గణపతి వ్రతం నిర్వహిస్తున్నట్లు ఆలయ వ్యవస్థాపకులు అయినవోలు అనంతమల్లయ్య శర్మ సిద్ధాంతి ఒక ప్రకటనలో తెలిపారు. పుత్రుల క్షేమం కోరుతూ.. వేద పండితుల మంత్రోచ్చరణలతో చేసే ఈవ్రతంలో భక్తులు అధికంగా రానున్నారని, తగిన వసతులు కల్పించినట్లు పేర్కొన్నారు. వివరాలకు 95051 02545 నంబర్‌లో సంప్రదించాలని కోరారు.

నేడు వాహనం వేలం

కాజీపేట అర్బన్: హనుమకొండ ఎక్సైజ్ స్టేషన్‌లో గురువారం బొలేరో వాహనానికి వేలం నిర్వహించనున్నట్లు హనుమకొండ ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ రామకృష్ణ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎక్సైజ్ కేసులో పట్టుబడిన బొలేరో వాహనం వేలం పాటను హనుమకొండ ఎక్సైజ్ స్టేషన్‌లో ఉదయం 10 గంటలకు నిర్వహించనున్నట్లు, ఔత్సాహికులు వేలం పాటలో పాల్గొనాలని సూచించారు.

నేడు 'పండుగల సందడి' పుస్తకావిష్కరణ

కాజీపేట: కాజీపేటలోని సెయింట్ ఫ్రాన్సిస్ అక్షర హైస్కూల్ ఆవరణలో గురువారం ఉదయం 10 గంటలకు కాయిత సారంగపాణి రచించిన పండుగల సందడి పుస్తకాన్ని ఆవిష్కరించనున్నారు. ఈకార్యక్రమంలో కవులు, రచయితలు డా.యల్లంభట్ల నాగయ్య, డాక్టర్ సీవీ జయవీర్రాజు, వాసిరెడ్డి కృష్ణారావు, కామారపు సురేశ్, రాజిడి నవీన్‌రెడ్డి పాల్గొననున్నారు.

ఫెల్లోషిప్‌నకు దరఖాస్తు చేసుకోవాలి

విద్యారణ్యపురి: మెడిసిన్, ఇంజనీరింగ్, ఎంబీఏ, పీజీ, డిగ్రీ చదువుతూ 80 శాతం మార్కులు సాధించిన విద్యార్థులు స్కాలర్‌ఫెల్లోషిప్ కోసం ఈనెల 25లోపు దరఖాస్తు చేసుకోవాలని స్వేరోస్ ఇంటర్నేషనల్ జిల్లా అధ్యక్షుడు శనిగరపు రాజేంద్రప్రసాద్ ఒక ప్రకటనలో తెలిపారు. స్వేరోస్ ఇంటర్నేషనల్ వెల్ఫేర్ ఆలూమ్ని అసోసియేషన్ నిరుపేదల విద్యార్థులకు అండగా నిలిచేందుకు కృషి చేస్తోందన్నారు. పూర్తి వివరాలకు స్వేరోస్ వెబ్‌సైట్‌ను సంప్రదించాలని ఆయన సూచించారు.

కొనసాగుతున్న ప్రతిష్టాపనోత్సవాలు

హసన్‌పర్తి: శ్రీ సీతా లక్ష్మణ సమేత శ్రీరామచంద్రస్వామి విగ్రహాల ప్రతిష్ఠాపన ఉత్సవాలు కొనసాగుతున్నాయి. కార్యక్రమంలో రెండో రోజు బుధవారం ఉదయం బాలభోగం, యాగశాలలో ద్వార తోరణ, ధ్వజ కుంభారాధన, చతుష్టానార్చన, హోమం, జలాధివాసం, ఉత్సవ మూర్తులకు ధాన్యాధివాసము, నిత్యపూర్ణాతి కార్యక్రమాలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. కార్యక్రమంలో శ్రీరామ సేవా సమితి, స్థానికులు తదితరులు పాల్గొన్నారు.

'ఓపెన్' పరీక్ష ఫీజు గడువు పెంపు

కాళోజీ సెంటర్: తెలంగాణ ఓపెన్ స్కూల్ సొసైటీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న పదో తరగతి, ఇంటర్మీడియట్ పబ్లిక్ పరీక్షల ఫీజు గడువు తత్కాల్ కింద పొడిగించినట్లు డీఈఓ వాసంతి, ఓపెన్ స్కూల్ ఉమ్మడి జిల్లా కోఆర్డినేటర్ ఎం.శంకర్‌రావు ఒక ప్రకటనలో తెలిపారు. మార్చి 4వ తేదీ వరకు మీ సేవ ద్వారా లేదా టీఎస్ ఆన్‌లైన్ కేంద్రాల ద్వారా చెల్లించవచ్చని, టెన్త్ పరీక్ష ఫీజు రూ.500, ఇంటర్ ఫీజు రూ.1000 చొప్పున చెల్లించాలని పేర్కొన్నారు. తత్కాల్ కింద పెంచిన గడువును వినియోగించుకొని మధ్యలో ఆగిన చదువును కొనసాగించుకోవచ్చని తెలిపారు.

3న దివ్యాంగ టీచర్లకు వైద్య శిబిరం

కాళోజీ సెంటర్: జిల్లాలోని దివ్యాంగ ఉపాధ్యాయుల కొరకు ప్రత్యేక వైద్య శిబిరం మార్చి 3న ఎంజీఎం ఆస్పత్రిలో ఏర్పాటు చేసినట్లు డీఈఓ వాసంతి ఒక ప్రకటనలో తెలిపారు. దివ్యాంగ (ఆర్థో, న్యూరో, ఈఎన్‌టీ, సైకియాట్రిస్టు) ఉపాధ్యాయులకు సదరం సర్టిఫికెట్ జారీ కొరకు ప్రత్యేక మెడికల్ క్యాంపు ఉన్నందున ఫ్రెష్, రెన్యూవల్ కొరకు మీ సేవ కేంద్రంలో స్లాట్ బుక్ చేసుకోవాలని సూచించారు. స్లాట్ బుక్ చేసుకున్న వారు మాత్రమే సదరం క్యాంపున హాజరు కావాలని, స్లాట్ ఆన్‌లైన్ సైట్ గురువారం నుంచి అందుబాటులో ఉంటుందని ఆమె పేర్కొన్నారు.

'ప్రజా పంథా' ఆవిర్భావ దినోత్సవం

ఖిలా వరంగల్: పెట్టుబడిదారి దోపిడీ వ్యవస్థను కూల్చివేసేందుకు పీడిత ప్రజలంతా విప్లవోద్యమంలో భాగస్వాముల కావాలని సీపీఐ (ఎంఎల్) ప్రజా పంథా వరంగల్ డివిజన్ కార్యదర్శి బొట్ల రాకేశ్ పిలుపునిచ్చారు. ఆ పార్టీ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా బుధవారం ఖిలా వరంగల్ పడమరకోటలో జెండాను ఆవిష్కరించారు. కార్యక్రమంలో రాజు, నరసింహరావు, మైదంపాణి, మోహన్, అక్బర్, ప్రవీణ్, మల్లేశం, నాగరాజు పాల్గొన్నారు.

క్రైం కార్నర్..

బెదిరించిన వ్యక్తిపై కేసు

ఖిలా వరంగల్: 30 ఏళ్లుగా ఇంట్లో నివాసం ఉంటున్న కుటుంబాన్ని ఖాళీ చేయాలని బెదిరించిన కేసులో ఓవ్యక్తిపై కేసు నమోదు చేసినట్లు ఇన్‌స్పెక్టర్ ముస్క శ్రీనివాస్ తెలిపారు. వరంగల్ కరీమాబాద్‌లో ఇంట్లో 30 ఏళ్లుగా నివాసం ఉంటున్న నెరుమల్ల ప్రేమలీలను సోమవారం మధ్యాహ్నం రాచర్ల రాజేశ్వర్‌రావు ముగ్గురు వ్యక్తులను పంపించి ఇళ్లు ఖాళీ చేయాలని.. లేకుంటే చంపేస్తానని బెదిరించాడు. ఆమె ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఇన్‌స్పెక్టర్ ముస్క శ్రీనివాస్ తెలిపారు.

ఇంటికి తాళం వేసిన వ్యక్తిపై..

ఖిలా వరంగల్: వరంగల్ పుప్పాలగుట్టలో విక్రయించిన ఇంటికి తాను మొదటి యజమానిని అంటూ గేటుకు తాళం వేసిఐత యాకూబ్‌పై కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు. యాకూబ్ గతంలో తన ఇంటిని తూతూరు మల్లయ్యకు అమ్మేశాడు. బుధవారం తానే మొదటి ఓనర్‌ను అంటూ ఇంటి గేట్‌కు తాళం వేశాడు. బాధితుడు పోలీసులను ఆశ్రయించాడు.

మరొకరిపై..

కాజీపేట: కిరాణా దుకాణంలో పని చేస్తూ వస్తువులు అపహరిస్తున్న కుదుదల రాజుపై కేసు నమోదు చేసినట్లు ఇన్‌స్పెక్టర్ గట్ల మహేందర్‌రెడ్డి తెలిపారు. కాజీపేట పోలీస్‌స్టేషన్‌లో బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. రహమత్‌నగర్ కాలనీలో కిరాణం నడుపుతున్న ఎలుగురు శివ కళ్యాణ్ ప్రసాద్ వద్ద పనిచేస్తున్న రాజు గోడౌన్ నుంచి విలువైన సామగ్రి అపహరిస్తున్నట్లు సీసీ కెమెరాల ఆధారంగా గుర్తించారు. యజమాని ప్రసాద్ పోలీసులకు ఫిర్యాదు చేశారు.

ఆటో దగ్ధం

ఖిలా వరంగల్: వరంగల్ శాకరాశికుంట మైనార్టీ కాలనీకి చెందిన ఎండి అమ్జద్ ఇంటి ఎదుట నిలిపి ఉంచిన ఆటోను మంగళవారం అర్ధరాత్రి కొందరు ఆకతాయిలు దహనం చేశారు. మెలకువ వచ్చి చూసేసరికి ఆటో 40 శాతం కాలింది. న్యాయం చేయాలని మిల్స్‌కాలనీ పోలీసులకు అమ్జద్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కాగా.. గుర్తు తెలియని యవకులు రాత్రి పూట ఆటోలోనే మద్యం, గంజాయి సేవించి ఆమత్తులో ఆటోను తగులబెట్టారని, తనకు అమ్జద్ ఆరోపిస్తున్నాడు.

బైక్ చోరీ

ఖిలా వరంగల్: శివనగర్ పల్లవి ఆస్పత్రి లేన్‌కు చెందిన నేమటూరి నరేందర్ తన ఇంటి ఎదుట పార్క్‌చేసిన ఫ్యాషన్ ప్రో బైక్ ఈనెల 19న ఆదివారం తెల్లవారు జామున చోరీకి గురైంది. రెండ్రోజులు నగరంలో తిరిగినా దొరక్కపోవడంతో బుధవారం బైక్ మిల్స్‌కాలనీ పోలీసులకు ఫిర్యాదు చేశాడు.